

## స్వచ్ఛ్ విద్యాలయ..!
పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేసేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది.

వివరాలు 8లో ▸



## జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో
ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.1 /26.2

## వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం, చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

గద్వాల: ఈ నెల 17, **18వ తేదీలలో** మెదక్‌లోని ఇందిరా గాం**ధీ స్టేడియంలో** జరిగిన రాష్ట్రస్థాయి అథ్లె**టిక్స్ పోటీల్లో** గద్వాల క్రీడాకారులు ప్రతిభ చాటారు. మహిళల అండర్‌–23 విభాగం 1800 మీటర్ల పరుగు పందెంలో జిల్లాకు చెందిన క్రీడాకారిణి జయలక్ష్మి రాష్ట్రస్థాయిలో మొదట స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించింది. 1500 మీటర్ల పరుగు పందెంలో మనాల టాబు రెండవ స్థానంలో, ఉషారాణి మూడవ స్థానంలో నిలిచారు. పురుషుల విభాగంలో మహేష్ 3 వేల మీటర్ల ట్రిపుల్ జంప్‌లో మూడో స్థానంలో నిలిచారు. అండర్‌–12 విభాగంలో రఘుపతి నాయుడు 400 మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. గణేష్ జావలిన్ త్రో విభాగంలో మూడవ స్థానంలో నిలిచారు. రాష్ట్రస్థాయిలో జిల్లాకు మెడల్స్ లభించడం గర్వకారణమని డీవైఎస్‌ఓ బీఎస్ ఆనంద్, ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జితేందర్ పేర్కొన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీసన్న, సతీష్ కుమార్‌లు విద్యార్థుల ప్రతిభను కొనియడారు.

### పెండింగ్ వేతనాలు చెల్లించాలి

గద్వాల క్రైం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని గద్వాల కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా ఆస్పత్రి ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నో జిల్లాల్లో పనిచేసే ఉద్యోగులు జీతాలు రాక ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ఇటీవల ఓ ఉద్యోగి ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలిచి వేసిందన్నారు. సూర్యాపేట ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వసీం మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబభారం, అప్పులు అధికమవడంతో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. వసీం మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఇప్పటికైన కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి వెంటనే జీతాలు చెల్లించాలన్నారు. రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో రామకృష్ణ, వినోద్‌కుమార్, శ్యాం, వెంకట్‌స్వామి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 22న ఉమ్మడి జిల్లా యోగా క్రీడాకారుల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని స్టేడియంలో గురువారం ఉదయం 9 గంటలకు ఉమ్మడి జిల్లాస్థాయి యోగా క్రీడాకారుల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.రాములు, ఆర్.బాలరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డు, వయస్సు నిర్ధారణ ధ్రువపత్రంతో రావాలని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాస్థాయిలో ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 30 నుంచి వచ్చే నెల 1 వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి యోగా టోర్నీలో పాల్గొంటారని చెప్పారు. ఆసక్తి గల యోగా క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొనాలని, పూర్తి వివరాల కోసం సెల్ నం.90525 54298ను సంప్రదించాలని సూచించారు.

# వసూళ్ల దందా..

## గద్వాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డబ్బులిస్తేనే పని




- ఔట్ సోర్సింగ్ సిబ్బందిదే హవా
- లీగల్‌హైర్ రిజిస్ట్రేషన్‌కు రూ.5వేలు.. సాధారణ వాటికి రూ.వెయ్యి
- నిబంధనలకు విరుద్ధంగా చేస్తే రూ.లక్ష వరకు వసూలు
- తాను చెప్పిన సమయాల్లో రాకపోతే ధ్రువపత్రాలు చూడనని ఎస్‌ఆర్ హుకూం



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేసే క్యాబిన్‌లో అలంపూర్ నుంచి వచ్చిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి

గద్వాల రూరల్: గద్వాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ వసూళ్ల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. ఒక్కో పనికి ఒక్కో రేటు ముట్టజెబితేనే ఫైల్ ముందుకు కదులుతుంది. లేదంటే పెండింగ్‌లో పడిపోతుంది. ఈ దందా మొత్తం ఔట్ సోర్సింగ్ సిబ్బంది కనుసన్నల్లోనే కొనసాగుతోంది. కేవలం ఈ మామూళ్ల వసూలుకు అలంపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ప్రత్యేక పైరవీతో ఇక్కడ పనిచేస్తున్నాడంటే అక్రమాలు ఏస్థాయిలో జరుగుతున్నాయో స్పష్టమవుతోంది.

**ఒక్కో పనికి ఒక్కో రేటు..**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక్కో పనికి ఒక్కో రేటు వసూలు చేస్తున్నారు. కార్యాలయంలో ప్రతిరోజు కనిష్టంగా 50–60 రిజిస్ట్రేషన్లు, సీసీ(సర్టిఫైడ్ కాపీ)లు 50–60, ఈసీ(ఎంక్యూబరెన్స్ సర్టిఫికెట్ )60–70 వరకు లావాదేవీలు జరుగుతుంటాయి. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఒక్కో డాక్యుమెంట్‌పై రూ.1000–1500 వరకు రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే వారికి ముట్టజెప్పాల్సిందే. ఇందులో రూ.1000 వరకు సబ్‌రిజిస్ట్రార్‌కు, మిగిలిన రూ.500 కార్యాలయంలో పనిచేసే ఇతర ఉద్యోగులు, సిబ్బంది జేబుల్లోకి వెళ్తాయి. ఇలా రోజుకు 50రిజిస్ట్రేషన్లు జరిగితే రోజుకు రూ.75వేలు లంచాల రూపంలో అక్రమార్కులకు వెళ్లాల్సిందే.

**వసూళ్లకు నమ్మినబంటు..**

ఇలా ప్రతిరోజు మామూళ్ల రూపంలో వచ్చే డబ్బులను కలెక్షన్ చేయానికి అలంపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కిందిస్థాయి ఉద్యోగిని ప్రత్యేక పైరవీ చేసి గద్వాలకు వచ్చేలా చేసినట్లు తెలిసింది. సదరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కార్యాలయంలో ముఖ్యఅధికారికి నమ్మినబంటు కావడంతో అక్కడున్న వారందరూ సదరు వ్యక్తికి ప్రత్యేక గౌరవం ఇవ్వాల్సిందే. ఏ రోజు వసూలైన డబ్బులు ఆ రోజు సదరు వ్యక్తి కార్యాలయ ముఖ్యఅధికారికి ముట్టచెబుతాడని సమాచారం.


### ఆరోపణలు అవాస్తవం

రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఎలాంటి లంచాలు తీసుకోవడం లేదు. సరైన డాక్యుమెంట్లు ఉండి నిబంధనల మేరకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజు చెల్లిస్తే రిజిస్ట్రేషన్ చేస్తున్నాం. కలెక్షన్ కోసం అలంపూర్ నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని నియమించలేదు. ఇక్కడ అటెండర్ లేకపోవడంతో డిప్యూటేషన్‌పై తీసుకున్నాం. మరో ఇద్దరు ఔట్ సోర్సింగ్ అక్రమ వసూళ్లకు పాల్పడితే విచారించి చర్యలు తీసుకుంటాం.

– బషీర్, సబ్‌రిజిస్ట్రార్ గద్వాల

### నిబంధనలు తుంగలో తొక్కి..

ఇక సరైన డాక్యుమెంట్లు లేకుండా చేసే రిజిస్ట్రేషన్లకు స్థలాల విలువను బట్టి కనిష్టంగా రూ.లక్ష నుంచి ఆపై డబుల్ డిజిట్ వరకు వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇందులో భాగంగానే ఈనెల 8వ తేదీన అయిజకు చెందిన ఓ భూమిని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ప్లాట్‌గా చూపెట్టి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. ఈ వ్యవహారంలో రూ.2లక్షల వరకు ముట్టినట్లు బాహాటంగానే చర్చించుకోవడం విశేషం. చివరన వేలిముద్రలు సేకరించేందుకు రూ.100–150 వరకు వసూలు చేస్తుండడం గద్వాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వసూళ్ల పరాకాష్టకు నిదర్శనం.



భూమిని ప్లాట్‌గా చూపించి రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్

ఇదిలాఉండగా, సీసీ (సర్టిఫైడ్‌కాపీ)లకు సంబంధించి టీ–యాప్ ఫోలియో ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో చలానా రూపంలో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. రూ.510 చలానా (ఇందులో రూ.500 చలానా, రూ.10 సర్వీస్ చార్జీలు)చెల్లించాలి. కానీ ఇక్కడ మాత్రం ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఒక్కో సీసీపై డిమాండ్ బట్టి రూ.1000 వరకు వసూలు చేస్తున్నారు. అదేవిధంగా ఈసీ

### వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు

సర్టిఫికెట్‌కు సంబంధించి 2000 సంవత్సరం నుంచి అయితే రూ.510, అంతకు పూర్వం అయితే రూ.1010 ప్రభుత్వానికి చలానా రూపంలో చెల్లించాల్సి ఉంది. కానీ ఇక్కడ కూడా డిమాండును బట్టి రూ.1500–2000 వరకు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. రెండు సర్టిఫికెట్లు రోజుకు వందవరకు దరఖాస్తు చేసుకుంటుండగా దీనిపై కనిష్టంగా రూ.50వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఇక డెత్‌కేసులలో లీగల్‌హైర్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఒక్కో డాక్యుమెంట్‌కు లంచాల రూపంలో రూ.5వేలు ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు బాహాటంగానే చెబుతుండడం విశేషం.

# అర్హులందరికీ ఓటు హక్కు



తహసీల్దార్లతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రావు

గద్వాల రూరల్: 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తూ పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం ఐడీవోసీలోని తమ ఛాంబర్‌లోని ఓటరు జాబితాపై తహసీల్దార్లతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18ఏళ్లు నిండే ప్రతీ ఒక్కరు ఓటుహక్కు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నెల 20వ తేదీ నుంచి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు, షెడ్యూల్ ప్రకారం కార్యాచరణ రూపొందించుకుని ఓటరు జాబితా సవరణ పూర్తి చేయాలని సూచించారు. ఈనెల 20 నుంచి వచ్చే అక్టోబర్ 18 వరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని, బూత్‌లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి పరిశీలించి నూతన ఓటరు నమోదు చిరునామా మార్పు, తప్పుల సవరణ వంటివి చేపట్టాలని ఆదేశించారు. వచ్చే అక్టోబర్ 29వ తేదీ ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించనున్నట్లు, వీటిపై సవరణలు, అభ్యంతరాలకు నవంబర్ 28వరకు స్వీకరిస్తారని, డిసెంబర్ 24లోగా పరిష్కరించనున్నట్లు వివరించారు. ఓటరు జాబితా రూపకల్పనలో ఇంటింటి సర్వే చాలా ముఖ్యమని, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి వారి సూచనలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్లు, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా వెల్లివిరిసిన ఆత్మీయ బంధం



కలెక్టర్ బీఎం సంతోష్‌కు రాఖీ కడుతున్న బాలసదన్ చిన్నారులు

### జిల్లా వ్యాప్తంగా ఘనంగా రాఖీ వేడుకలు

గద్వాల రూరల్/గద్వాల/గద్వాల క్రైం: అన్నా చెల్లెళ్లు.. అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమిని సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. వాడవాడల రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు నుదుట కుంకుమ పెట్టి రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. మరికొందరు కొరియర్, పోస్టల్ ద్వారా తమ సోదరులకు రాఖీలు పంపారు. పట్టణంలోని ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఏబీవీపీ, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థులు...నేను నీకు రక్షా.. నీవు నాకు రక్షా.. మనిద్దరం దేశానికి రక్షా అంటూ వేడుకలు చేపట్టారు. ప్రజాపిత బ్రహ్మకుమారీలు రాజకీయ నాయకుల ఇళ్లకు వెళ్లి రాఖీలు కట్టారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి రాఖీ వేడుకల్లో పాల్గొన్నారు.

**అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీక.. : కలెక్టర్, ఎస్పీ**

అన్నాచెల్లెల్ల ఆత్మీయతకు ప్రతీక రాఖీపౌర్ణమి అని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో బాలసదన్ చిన్నారులతో రాఖీ కట్టించుకున్నారు. చిన్నారులతో రాఖీపండుగ జరుపుకోవటం చాలా ఆనందంగా ఉందని, బాలసదన్ విద్యార్థుల ఆరోగ్యం, చదువు కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని కలెక్టర్ సూచించారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు. అలాగే, ఎస్పీ శ్రీనివాసరావుకు చిన్నారులు స్వయంగా తయారు చేసిన క్రాఫ్ట్ వర్క్ డిజైన్ల రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు చూపే ప్రేమ, కల్మషం లేని చిరునవ్వులు ఎంతో సంతోషాన్ని కలిగిస్తాయని, బాలసదన్ చిన్నారుల అభ్యున్నతికి పోలీసు శాఖ పూర్తి స్థాయిలో చేయూత అందిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. అనంతరం చిన్నారులకు స్వీట్స్ అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో సుజాత, డీసీపీవో నర్సింహా, సూపరింటెండెంట్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీకి రాఖీ కడుతున్న బాలికలు



రాఖీ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

### ప్రజావాణికి 18 ఫిర్యాదులు

గద్వాల రూరల్: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 18 ఫిర్యాదులు వచ్చినట్లు వీటిని ఆయా శాఖలకు చెందిన అధికారులకు పంపించారు. ప్రతి ఫిర్యాదుదారునికి పరిష్కారం చూపాలని లేని పక్షంలో అందుకు సంబంధించిన కారణాలను వివరిస్తూ ఫిర్యాదుదారునికి అక్‌నాలెడ్జ్‌మెంట్ పంపాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, ఆర్డీవో రాంచందర్, ఎస్‌డీసీ శ్రీనివాస్‌రావు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

### బడుగులపై పిడుగు

**వానకు తడిసి.. ఎండకు ఎండి.. పంటే ప్రాణంగా బతికే రైతులపై ప్రకృతి కన్నెర్రజేసింది. పొలంబాట పట్టిన ముగ్గురు కర్షకులను విధి చిన్నచూపు చూసింది. మృత్యురూపంలో వచ్చిన పిడుగు వారిని కబళించింది. బాధిత కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. మరో 9మంది తీవ్రగాయాలై ఆస్పత్రుల పాలయ్యారు. ఈ విషాదకర సంఘటనలు అలంపూర్, గద్వాల నియోజకవర్గాల్లో సోమవారం చోటుచేసుకున్నాయి.**



వివరాలు 8లో ▸



### పొంగిపొర్లిన వాగులు..

జిల్లాలో సోమవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షంతో చాలా చోట్ల వాగులు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. ఈక్రమంలో బోయలగూడెం – చిన్నోనిపల్లె గ్రామాల మధ్య ఉన్న వాగు ఒక్కసారిగా పొంగి పొర్లింది. దీంతో వ్యవసాయ పొలాల నుంచి ఇళ్లకు చేరుకునే రైతులు, కూలీలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరికి అవతలి వైపు నుంచి ఇవతలికి తాడు ఏర్పాటుచేయడంతో.. దాని సహాయంతో దాటుకుంటూ వచ్చారు. – గట్టు

# ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ

జోగుళాంబ శక్తిపీఠం: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని జిల్లాలోని పలు ప్రముఖ ఆలయాలన్ని ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. సోమవారం అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి, బీచుపల్లి ఆంజనేయ స్వామి, మల్దకల్ స్వయంభూ వెంకటేశ్వరస్వామి, చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయాలు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం అలుముకున్నాయి.

**ప్రముఖుల ప్రత్యేక పూజలు**

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాలను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. హైద్రాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, నైమిశారణ్య పీఠాధిపతులు బాలబ్రహ్మ నాంద సరస్వతి, మాజీ హోం మంత్రి కుటింబీకులు తూళ్ల శ్వేత తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. నైమిశారణ్య పీఠాధిపతి బాలబ్రమ్మానంద సరస్వతి స్వామివారు శక్తిపీఠం, వాటి రహస్యాలు అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఇదిలాఉండగా, జోగుళాంబ అమ్మవారికి హైద్రాబాద్ నగర వాస్తవ్యులు సురేష్ అంజనాదేవి దంపతులు 5 గ్రాముల విలువ చేసే బంగారు ముక్కు పుడకను అందజేశారు. వీటిని ఆలయ కార్యనిర్వహన అధికారి పురందర్‌కుమార్‌కు అందజేశారు. అలాగే, హరిశ్చంద్రఘాట్‌లో ప్రతిష్ఠించిన అష్టభుజి జోగుళాంబ సమేత ఘంటలేశ్వర స్వామివారి ఆలయంలో కల్యాణోత్సవంతో పాటు హోమం నిర్వహించారు.



బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో లక్ష్మీ హయగ్రీవ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**వైభవంగా లక్ష్మీ హయగ్రీవుల కల్యాణం**

ఎర్రవల్లిచౌరస్తా: శ్రావణ పౌర్ణమిని పురష్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామ స్వామి ఆలయంలో సోమవారం లక్ష్మీ హయగ్రీవుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్రోత్సవాలలో భాగంగా చివరిరోజు ఆలయంలో వేద దివ్యప్రబంధ పారాయణం, యాగశాలలో చతుస్థానార్చన, మూలమంత్ర మూర్తిహోమం, శాంతిహోమం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రాల నడుమ శ్రీ లక్ష్మీ హయగ్రీవులకు అంగరంగవైభవంగా కల్యాణం జరిపించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



జోగుళాంబ అమ్మవారికి బంగారు ముక్కుపుడక అందజేస్తున్న భక్తులు

**కనులపండువగా స్వామి వారి కల్యాణం**

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో రాఖీపౌర్ణమి సందర్భంగా సోమవారం స్వామి వారి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయంలో ప్రతినెల పౌర్ణమి రోజున స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే వేదపండితులు రమేషాచారి, మధుసూదనాచారి, ధీరేంద్రదాస్, నాగరాజుశర్మ, రవిచారి వేదమంత్రోచ్చరణల మధ్య స్వామి వారి ఉత్సవమూర్తులకు ఘనంగా కల్యాణోత్సవం నిర్వహించగా.. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఇదిలాఉండగా, మండల కేంద్రానికి చెందిన దామ శంకరయ్య పార్వతమ్మ దంపతుల సమక్షంలో రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, దామరామక్రిష్ణ, దామ భీమరాయుడు పాల్గొన్నారు.

# విధులు బహిష్కరించిన న్యాయవాదులు

అలంపూర్: అలంపూర్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులు సోమవారం తమ విధులను బహిష్కరించారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయవాది సంతోష్‌పై పోలీసులు ప్రవర్తించిన తీరును నిరసిస్తూ విధులు బహిష్కరించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిపెద్ది సురేష్ కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఫెడరేషన్ పిలుపు మేరకు బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. న్యాయవాదులు విధులకు హాజరు కాకూడదని తీర్మానించినట్లు తెలిపారు. తీర్మానం కాపీని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కమలాపురం కవితకు అందజేసినట్లు పేర్కొన్నారు. అనంతరం కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు నారాయణ రెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, నాగరాజు, ఆంజనేయులు, యాకోబు, నాగరాజు యాదవ్, యుదుర్ బాష ఉన్నారు.



అలంపూర్ కోర్టులో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం

**అచ్చంపేట రూరల్:** రోడ్డు ప్రమాదంలో ఓ కానిస్టేబుల్ దుర్మరణం చెందిన ఘటన సోమవారం సాయంత్రం అచ్చంపేటలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అమ్రాబాద్ మండలం ఈగలపెంట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనునాయక్(33) సోమవారం ఉదయం స్టేషన్‌కు వెళ్లాడు. విధులు ముగించుకుని బైక్‌పై అచ్చంపేటకు వస్తుండగా పట్టణ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాలు వద్ద మరోబైక్ బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుండి కింద పడిపోయిన శ్రీనునాయక్ తలకు తీవ్ర గాయమై రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనలో అవతలి బైక్‌ను నడిపిన వ్యక్తికి సైతం గాయాలు కాగా అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. శ్రీనునాయక్‌కు భార్య చంద్రకళ, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

### పెద్దపూర్ సమీపంలో యాచకుడు..

**వెల్దండ:** పెద్దాపూర్ సమీపంలో హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యాచకుడు(25) దుర్మరణం పాలయ్యాడు. ఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో యాచకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి సమయంలో రోడ్డుపై అతడు కూర్చొని ఉన్న సమయంలో ఘటన చోటుచేసుకుంది. కాగా రాత్రి సమయం కావడంతో రోడ్డుపై మృతదేహాన్ని గమనించక ఇతర వాహనదారులు సైతం పై నుంచి వెళ్లారు. దీంతో మృతదేహం గుర్తుపట్టలేని స్థితికి చేరుకుంది. కాగా మృతదేహాన్ని ప్రస్తుతం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచినట్లు ఏఎస్‌ఐ వివరించారు.

### సిమెంట్ దిమ్మెను ఢీకొట్టి..


గణేష్(ఫైల్)

**మహబూబ్‌నగర్ క్రైం:** చీకటిలో రోడ్డుపై సిమెంట్ దిమ్మెను ఢీకొట్టి ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బాలానగర్ మండలం ఏడుగుట్టల తండాకు చెందిన గణేష్(24) ఆదివారం రాత్రి దేవరకద్ర మండలం చౌదర్‌పల్లిలో స్నేహితుడిని కలిసి తిరిగి షాద్‌నగర్‌కు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో పీయూ ఎదుట నిర్మాణంలో ఉన్న సిమెంట్ దిమ్మెను ఢీకొట్టగా.. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గణేష్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసునమోదు చేశారు.

### ఫ్యాన్‌కు ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

**భూత్పూర్:** మండలంలోని తాటిపర్తికి చెందిన ఎం.నందిని (17) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తాటిపర్తికి చెందిన మణెమ్మ, బాల్‌నాగయ్యకు కుమార్తె నందిని, కుమారుడు ఉన్నాడు. కొన్నేళ్ల క్రితం తల్లి మణెమ్మ మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని వెళ్లిపోయింది. గతేడాది భర్త బాలనాగయ్య మృతి చెందగా, అంత్యక్రియలకు సైతం మణెమ్మ రాలేదు. దీంతో నందిని మహబూబ్‌నగర్ మండలం పాలకొండలో గల మేనమామ వద్ద నందిని, తన సోదరుడు ఉన్నారు. నందిని కల్వకుర్తి కేజీబీవీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతుంది. పది రోజుల క్రితం కళాశాల నుంచి పాలకొండలోని మేనమామ వద్దకు వచ్చింది. తాటిపర్తికి వెళ్తున్నాని చెప్పి వారం రోజుల క్రితం వెళ్లింది. ఇంట్లో తల్లి మణెమ్మ ఉండటంతో ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని ప్రతి రోజు గొడవ పడ్డారు. మనస్తాపానికి గురైన నందిని ఆదివారం రాత్రి గదికి గొళ్లెం పెట్టుకుని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. ఉదయం తలుపులు తెరవకపోవడంతో చుట్టుపక్కల వారి సాయంతో తల్లి తలుపులు తెరవగా, అప్పటికే మృతి చెందింది. మేనత్త వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### మద్యానికి బానిసై మరొకరు..

**త్రిపురారం:** కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చిన వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం అప్పలయ్యగూడెం పంచాయతీ పరిధిలోని సీత్యతండాలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ వీరశేఖర్ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం పుల్లగిరికి చెందిన ముడావత్ బాలు(43) మద్యానికి బానిసై పిచ్చివాడిలా తిరుగుతున్నాడు. అతడిని కుటుంబ సభ్యులు ఆదివారం సీత్యాతండాలో ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు ఆలయంలో ఉండగా.. రాత్రి 10 గంటలకు బహిర్భూమికి వెళ్లొస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో అతడి భార్య ముడావత్ తరి ఆలయం బయటకు వెళ్లి వెతకగా.. గుడికి సమీపంలో చెట్టుకు తన లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. ఈ ఘటనపై బాలు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# స్వచ్ఛ్ విద్యాలయ..!

**ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లు, మూత్రశాలలు శుభ్రం**

- జేకేఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలు
- 270 బడుల్లో కొనసాగుతున్న సేవలు
- మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో..
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



మహమ్మదాబాద్‌లో టాయిలెట్లు శుభ్రం చేస్తున్న సిబ్బంది

**గండేడ్:** పాఠశాలల్లో స్కావెంజర్లు లేరు.. అటెండర్లు ఇతర సిబ్బంది కూడా అరకొరగా ఉన్నారు. దీంతో మరుగుదొడ్లు, మూత్రశాలలు శుభ్రం చేయడం కష్టతరమైంది. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు సొంత డబ్బులతో తాత్కాలికంగా సిబ్బందిని నియమించుకొని పారిశుద్ధ్య పనులు చేయించుకుంటున్నారు. టాయిలెట్లు శుభ్రంగా లేక విద్యార్థులు అనారోగ్యం బారిన పడిన ఘటనలూ ఉన్నాయి. ఇలాంటి సమయంలో హైదరాబాద్‌కు చెందిన జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ (జేకేఎంఆర్ ఫౌండేషన్) ముందుకొచ్చి స్వచ్ఛ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ్ విద్యాలయ పేరిట మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతో మూత్రశాలలు, మరుగుదొడ్లు శుభ్రం చేసే మహత్తర బాధ్యతను తీసుకొని అందుకు అనుగుణంగా సేవలందిస్తున్నారు.

**మూడు జిల్లాల్లో..**

జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ సేవలు మూడు జిల్లాలకు విస్తరించాయి. రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌తో పాటు నూతనంగా ఏర్పాటైన వికారాబాద్ మూడు జిల్లాలోని 11 మండలాల్లో ఉన్న 270 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కార్యక్రమం కొనసాగుతోంది. ఇందుకుగాను 9 వాహనాలు ఏర్పాటుచేసి 10 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించుకొని పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. పరిగి నియోజకవర్గం మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని గండేడ్, మహమ్మదాబాద్‌తో పాటు రంగారెడ్డి జిల్లా చేవేళ్ల నియోజకవర్గంలోని చేవేళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్, వికారాబాద్ జిల్లాలోని మర్పల్లి, కోట్‌పల్లి, తాండూరు నియోజకవర్గంలోని తాండూరు, యాలాల్, పెద్దేముల్ మండలాల్లోని పాఠశాలల్లో సేవలు అందుతున్నాయి. రెండు, మూడు మండలాలు మినహా మిగతా అన్ని మండలాల్లో 30 పాఠశాలల చొప్పున టాయిలెట్లు శుభ్రత చేస్తున్నారు. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లోని మహమ్మదాబాద్, గండేడ్, వెన్నాచేడ్, సల్కర్‌పేట్, చిన్నవార్వాల్, మొకర్లాబాద్, రంగారెడ్డిపల్లి, కొండారెడ్డిపల్లి, పగిడ్యాల్, బల్సూర్‌గొండ, కొండాపూర్, మన్సూర్‌పల్లి, కష్లాపూర్, పెద్దవార్వాల్, చిన్నవార్వాల్, జక్లపల్లి తదితర 21 గ్రామాల్లోని 32 పాఠశాలల్లో స్వచ్ఛ విద్యాలయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

**నిరంతర పర్యవేక్షణ..**

ఫౌండేషన్ ఏర్పాటు చేసిన వాహనంలో 500 లీటర్ల వాటర్‌ట్యాంకుతో పాటు ప్రెషర్ పంపు, యాసిడ్, ఫినాయిల్ ఉంటాయి. సేవలను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రస్తుత చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పర్యవేక్షిస్తూ సేవలకు విఘాతం కలగకుండా చూస్తున్నారు. ఇటీవల మండలంలోని గండేడ్, సల్కర్‌పేట్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి స్వచ్ఛ విద్యాలయ కార్యక్రమ నిర్వహణను పరిశీలించారు. సామాజిక సేవ కార్యక్రమాల్లో ఇదొక్కటే కాకుండా వైద్య శిబిరాలు, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం, బోటింగ్‌తో ఉపాధి, జాబ్‌మేళాలు, స్వయం ఉపాధి అవకాశాలు, చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**దుర్వాసన వచ్చేది**



గతంలో పాఠశాలలోని టాయిలెట్లు శుభ్రంగా లేకుండేవి. కడిగేవారు లేక దుర్వాసన వచ్చేది. దీంతో అందులోకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది. చేసేదిలేక తోటి విద్యార్థినులతో కలిసి పొలాల్లోకి వెళ్లేవాళ్లం. కొంతకాలంగా జేకేఎంఆర్ ఫౌండేషన్ వారు టాయిలెట్లను శుభ్రం చేస్తున్నారు. ప్రస్తుతం బయటికి వెళ్లకుండా పాఠశాలలో ఉన్న టాయిలెట్లనే వినియోగిస్తున్నాం.
– అక్షిత, పదోతరగతి, బాలికల పాఠశాల, వెన్నాచేడ్

**ఇబ్బందులు తొలగాయి..**



గతంలో పాఠశాలల్లో టాయిలెట్లు సరిగా లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు. స్కావెంజర్లను తొలగించడంతో శుభ్రం చేయక నిరుపయోగంగా మారాయి. చేసేదిలేక అమ్మాయిలు గుంపులు గుంపులుగా బయటికి వెళ్లే వారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద కొత్త టాయిలెట్లు నిర్మాణం జరగడం.. వాటిని శుభ్రం చేసేందుకు ఫౌండేషన్ బాధ్యతలు తీసుకోవడం హర్షణీయం. ఇప్పుడు అమ్మాయిలు బయటికి వెళ్లకుండా పాఠశాలల్లో ఉన్న టాయిలెట్లను వినియోగించుకుంటున్నారు.
– రాధిక, ఉపాధ్యాయురాలు, సల్కర్‌పేట

**ఉపాధి కల్పించారు..**



ఫౌండేషన్ వారు ఈ కార్యక్రమం ప్రారంభించినప్పటి నుంచి ఇందులో పని చేస్తున్నా. ఇలాంటి పని చేయడానికి చాలా మంది వెనుకడుగు వేస్తారు. విద్యార్థుల కోసం ఈ రకమైన సేవ చేయడం సంతోషంగా ఉంది. ఫౌండేషన్ వారు ఇచ్చిన వాహనంలో సామగ్రి తీసుకొని మహమ్మదాబాద్, గండేడ్ మండలంలోని 32 పాఠశాలల్లో ఉన్న టాయిలెట్లు నిత్యం శుభ్రం చేస్తున్నా.
– కిష్టయ్య, జేకేఎంఆర్ సిబ్బంది, గండేడ్

**స్వచ్ఛతే లక్ష్యంగా..**



స్వచ్ఛ విద్యాలయ కార్యక్రమానికి 2016లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. మొదట చేవెళ్ల నియోజకవర్గంలో ఒక వాహనంతో ప్రారంభించి తర్వాత విస్తరించారు. ప్రస్తుతం వేల మంది విద్యార్థులు పాఠశాలల్లోని టాయిలెట్లను సద్వినియోగం చేసుకుంటున్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నది ఇందులో భాగం. అలాగే కొత్తవాటి కోసం ఆశించకుండా ఉన్న టాయిలెట్లను చక్కగా శుభ్రం చేసి వినియోగించుకుంటే మంచిది. ఇంకెవరైనా ముందుకొస్తే ఈ సేవలు మరింత విస్తరించేందుకు కృషిచేస్తాం.
– రాములు, కో–ఆర్డినేటర్, జేకేఎంఆర్ ఫౌండేషన్

## ఉమామహేశ్వరంలో జలసవ్వడి


జలపాతం వీక్షిస్తున్న యువకులు

**అచ్చంపేట రూరల్:** నల్లమలలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రం ప్రాంతంలో కొండపై నుంచి వర్షపు నీరు జాలువారుతోంది. ప్రకృతి రమణీయత సంచరించుకోవడంతో సోమవారం భక్తులు, పర్యాటకులు ఈ అందాలను వీక్షించేందుకు తరలివచ్చారు. నీరు కొండపై నుంచి పడుతుండటాన్ని చూసి పులకించిపోయారు. తమ సెల్‌ఫోన్‌లలో ఆ దృశ్యాలను బంధించారు. కాగా చాలా రోజుల తర్వాత జలపాతం వస్తోందని ఆలయ సిబ్బంది తెలిపారు. అదే సమయంలో కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉందని భక్తులు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

## వడ్డేపల్లి ఆలయంలో చోరీ



**శాంతినగర్:** వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడు సమీపంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ప్రధాన ద్వారానికి ఉన్న తాళం పగులగొట్టి ప్రవేశించిన దొంగలు హుండీని పగులగొట్టి నగదు, పూజా సామగ్రిని సైతం ఎత్తుకెళ్లినట్లు భక్తులు తెలిపారు. రెండు రోజుల క్రితం శాంతినగర్ సమీపంలోని కోయిల్‌దిన్నె రోడ్డులోని వీరబ్రహ్మేంద్ర స్వాములవారి ఆలయంలోని అమ్మవారి మెడలోని పుస్తెలు దొంగలు ఎత్తుకుపోవడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు.

### తాళం వేసిన ఇంట్లో..

**జడ్చర్ల:** తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి బంగారం, వస్తువులను ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. పట్టణానికి చెందిన చీర్ల నరేందర్‌సాగర్ 16న ఇంటికి తాళం వేసి కల్వకుర్తిలో బంధువుల శుభ కార్యానికి వెళ్లాడు. సోమవారం తిరిగి వచ్చే సరికి తాళం విరగ్గొట్టి ఉండడాన్ని గమనించాడు. బీరువాలో దాచిన అర తులం బంగారు ఉంగరంతో పాటు ఇతర వస్తువులు కనిపించలేదు. వీటి విలువ దాదాపు రూ.15వేలు ఉంటుదని తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## అధైర్యపడకు ధైర్యంగా ఉండు..

- మక్తల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్‌కు ఫోన్ చేసిన కేటీఆర్


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజినీ సాయిచంద్

**మక్తల్:** మక్తల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్ పెద్ద కుమారుడు అమృతగౌడ్ తమిళనాడులో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కేటీఆర్, నర్సింహగౌడ్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో చిన్నవయసులో అమృతగౌడ్ మృతిచెందడం బాధాకరమని అన్నారు. ధైరంగా ఉండూ.. ఏమాత్రం అధైర్యపడకు, రెండు మూడు రోజుల్లో ఇంటికి వస్తా.. కలుస్తానని, అండగా నేను ఉంటానని ధైర్యం చెప్పారు. అనంతరం గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజినీ సాయిచంద్ మక్తల్‌లోని నర్సింహగౌడ్ ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## పోలీస్‌స్టేషన్ చేరిన ఒండ్రుమట్టి పంచాయితీ


ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్ వద్ద గ్రామస్తులు

**ఖిల్లాఘనపురం:** మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువు ఒండ్రుమట్టి తరలింపు పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపసముద్రం చెరువుకు మరమ్మతుల కారణంగా నీటిని పూర్తిస్థాయిలో తీసివేశారు. ఇదే సమయంలో చెరువులో పట్టాభూములు ఉన్న కొందరు రైతులు సుమారు 36 ఎకరాల్లోని ఒండ్రుమట్టిని విక్రయించుకున్నారు. ఈ ఒండ్రుమట్టిని కొనుగోలు చేసిన వ్యక్తి కురుమూర్తిరాయ రిజర్వాయర్‌కు తరలిస్తున్నట్లు అనుమతులు తీసుకుని చెరువులో నుంచి అల్లమాయపల్లికి చెందిన మురళీధర్‌రెడ్డి పొలంలోకి తరలించి నిల్వ చేసుకున్నాడు. ఈ విషయమై కొన్ని రోజులుగా ఖిల్లాఘనపురంలో ఒక్కొక్కరు ఒక్కో విధంగా చర్చించుకుంటున్నారు. చెరువులో కేవలం 5 ఫీట్ల వరకు మాత్రమే ఒండ్రుమట్టి తరలించాలని, కానీ ఓ అధికార పార్టీ నాయకుడి అండదండలతో ఏకంగా 15 ఫీట్ల వరకు ఒండ్రుమట్టిని తీసినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ ప్రభుత్వ అధికారి పొలంలోని మట్టిని తరలించి ఒక్క రూపాయి ఇవ్వకపోగా ప్రశ్నించిన అతనిని ఉన్నతాధికారులతో భయభ్రాంతులకు గురి చేసినట్లు తెలిసింది. మామిళ్ల అనిల్‌కుమార్ ఈ అంశాలతో వాట్సాప్‌లో ఓ 16న పోస్టు పెట్టాడు. దీనిపై మూడు రోజులుగా ఒండ్రుమట్టి విక్రయించుకున్న వారు అనిల్‌కుమార్‌కు తరుచూ ఫోన్‌చేసి ఇబ్బంది పెట్టారు. దీంతో లచ్చిరెడ్డి, యాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిర్పతిరెడ్డి తదితరులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఒండ్రుమట్టి అమ్ముకున్న వ్యక్తులు కూడా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. విషయం తెలియడంతో గ్రామస్తులతో పాటుగా మాజీ సర్పంచ్ వెంకటరమణ, మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ సామ్యానాయక్, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో స్టేషన్ దగ్గరికి చేరుకున్నారు. కొంతసేపు పెద్ద ఎత్తున గొడవ జరిగింది. చివరకు కేసులు పెట్టుకోవద్దని ఏదైన ఉంటే పంచాయితీ పెట్టి మాట్లాడాలని నిర్ణయించుకుని అక్కడి నుంచి వెళ్లారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎస్‌ఐ రామకృష్ణను వివరణ కోరగా గ్రామస్తులంతా వచ్చి వారే పంచాయితీ మాట్లాడుతకుని వెళ్లారని తెలిపారు.

## పొలం పనులకు వెళ్లి.. పిడుగుపాటుకు గురై

- జోగుళాంబ గద్వాల జిల్లాలో ముగ్గురి మృతి
- మరో 9 మందికి గాయాలు


కంచుపాడులో గాయపడిన ఖాజా, శాలీబిని ఆస్పత్రికి తరలిస్తున్న గ్రామస్తులు

**అలంపూర్ రూరల్/గట్టు/గద్వాల క్రైం/ఉండవెల్లి:** జోగుళాంబ గద్వాల జిల్లాలో సోమవారం పిడుగుపాటుకు గురై ముగ్గురు మృతిచెందారు. మరో 9 మందికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. అలంపూర్ మండలం క్యాతూర్‌కు చెందిన వేముల రాజు (40) రోజు మాదిరిగానే పొలం పనులకు వెళ్లాడు. అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో చెట్టు కిందకు వెళ్లిన అతడు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సత్యమ్మ, కుమారుడు మనీష్, కూతుళ్లు లావణ్య, సౌజన్య ఉన్నారు.

■ గట్టు మండలంలోని బోయలగూడెం, మిట్టదొడ్డి, ఆరగిద్ద గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఆరగిద్దకు చెందిన దివ్యాంగుడు తలారి నల్లారెడ్డి (30) వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటున్న క్రమంలో పిడుగుపాటుకు గురై మృత్యువాత పడ్డారు. పక్కనే పనులు చేసుకుంటున్న వారు క్షణకాలంలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇదే క్రమంలో మిట్టదొడ్డి గ్రామ శివారులో వ్యవసాయ పనులు చేసుకుంటున్న భీమేష్, అతడి భార్య రాజేశ్వరి, తల్లి లక్ష్మితో పాటు పక్క పొలంలో పనులు చేసుకుంటున్న లోకమ్మ, వీరేంద్రలు పిడుగుపాటుతో గాయపడ్డారు. వారిని కర్నూలు ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

■ కర్నూలు జిల్లా నందవరం మండలం కనకవీడు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి (15) 10 రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి మల్దకల్‌లో సీడ్‌పత్తి పనుల నిమిత్తం వచ్చారు.


నల్లారెడ్డి (ఫైల్)

రోజులాగే సోమవారం పొలంలో పనులు చేస్తున్న క్రమంలో ఉరుములతో కూడిన వర్షం కురిసింది. పొలంలో ఉన్న బాలిక పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి తండ్రి వీరశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు.

■ గద్వాల మండలంలోని కుర్వపల్లిలో పిడుగుపాటుతో తండ్రీ కొడుకు గాయపడ్డారు. గ్రామానికి చెందిన కుర్వ ఆనంద్, అతడి కుమారుడు అరుణ్ తేజ వ్యవసాయ పొలానికి వెళ్లారు. మధ్యాహ్నం అకాలవర్షం కురవడంతో చెట్టు కిందకు వెళ్లిన వీరు.. పిడుగుపాటుకు గురై గాయపడ్డారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

■ ఉండవెల్లి మండలంలోని కంచుపాడులో పిడుగుపాటుతో ఓ ఎద్దు మృతి చెందగా.. గ్రామానికి చెందిన పింజరి ఖాజా, అతడి భార్య శాలీబి గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. మండల కేంద్రంలో వేపచెట్టుపై పిడుగు పడటంతో పూర్తిగా ఒరిగిపోయింది.

## సివిల్స్ టాపర్ అనన్యకు అభినందన


అనన్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

**ఘట్‌కేసర్:** సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన అనన్యను సోమవారం కాచవానిసింగారం దివ్యానగర్ కాలనీ గ్రీన్ నెస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అనన్య తొలి ప్రయత్నంలోనే దేశంలోనే అత్యున్నత సర్వీస్ అయిన ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆమె ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా యూపీఎస్సీకి ఎంపికవడం అభినందనీయమని, యువత ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి మనోరంజన్‌రెడ్డి, విజయరాంరెడ్డి, వెంకటరమణారెడ్డి, పురుషోత్తమ రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పంట సాగులో కలుపు నివారణ

**పాడి-పంట**

**అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్**


మొక్కజొన్న పంటలో పెరిగిన గరిక కలుపు

**అలంపూర్:** వానాకాలం పంట సీజన్ ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతోంది. ముందస్తుగా కురిసిన వర్షాలకు అన్నదాతలు పంట సాగులో నిమగ్నమయ్యారు. రైతులు సాగు చేసే వివిధ పంటల్లో కలుపు సమస్య ప్రధానంగా ఉంటుంది. కలుపుతో 30 నుంచి 70 శాతం పంట నష్టం జరిగే అవకాశం ఉంది. వివిధ పంటల్లో వచ్చే కలుపును నివారించుకోడానికి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు. సాగు చేసిన పంటల్లో పెరిగే కలుపు నివారణకు ఇలా వివరించారు.

**వరిలో..:** వరిలో ఊడల నిర్మూలనకు ఎకరా నారుమడికి విత్తిన 2 నుంచి 3 రోజుల్లో ప్రిటిలాక్లోర్ 50 శాతం ద్రావకం 400 మిలీలీటర్లు లేదా విత్తిన 14, 15 రోజుల సమయంలో సైహాల్‌పాప్‌బ్యూటైట్ 10 శాతం ద్రావకం 400 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలి. లేదా ఊద వెడల్పాకు కలుపు సమపాళ్లలో ఉంటే నారుమడి విత్తిన 15 రోజులకు ఎకరాకు మిల్లీలీటర్ బిస్ పైరిబాక్ సోడియం(10) శాతం 200 లీటర్ల నీటిలో కలిపి చల్లాలి.

**మొక్కజొన్న..:** మొక్కజొన్న విత్తిన వెంటనే లేదా 2 నుంచి 3 రోజుల్లో ఎకరాకు 1-1.5 కిలోల అట్రాజీన్ పిచికారీ చేయాలి. తర్వాత 30 నుంచి 35 రోజుల్లో గొర్రు గంటుకతో అంతర్ కృషి చేయాలి.

**జొన్న..:** జొన్న విత్తిన వెంటనే లేదా 2 నుంచి 3 రోజుల్లో 600 నుంచి 800 గ్రాముల అట్రాజీన్‌ను విత్తిన 20 రోజుల తర్వాత అయితే 400 గ్రాముల 2, 4-డీ సోడియం సాల్ట్ 80 శాతం పొడిని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**కంది..:** కంది విత్తిన వెంటనే 1 లేక 2 రోజుల్లో ఎకరాకు 1.1.3 లీ పెండిమీథాలిన్ వాడాలి. విత్తిన 30 లేక 60 రోజుల్లో గొర్ర గుంటకతో అంతర్ కృషి చేయాలి. లేదా ఇమజితాపీర్ ఎకరాకు 200 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలి.

**మినుము, పెసర..:** విత్తిన 1 లేక 2 రోజుల్లో ఎకరాకు 1-1.3 లీటర్ల పెండిమీథాలిన్‌ను విత్తిన 20 రోజులకు గడ్డి జాతి కలుపు నివారణకు 250 మిల్లీలీటర్ల పెనాక్స్‌ప్రాప్ ఇథైల్ 5 శాతం మందును 200 లీటర్ల నీటిలో కలిపి చల్లాలి.

**మినుములు..:** పొలంలో గడ్డిజాతి వెడల్పాకు ఉంటే ఎకరాకు 200 మిల్లీలీటర్లు ఇమిజితాపిర్ 10 శాతం పొడి పిచికారీ చేయాలి. ఈ మందు చల్లితే మినుము పెరుగుదల వారం పాటు ఆగినప్పటికీ తిరిగి మాముల స్థితికి వస్తోంది.

**శనగ..:** పైర్లు విత్తిన వెంటనే లేదా ఒకటి లేక రెండు రోజుల్లో ఎకరాకు 1-1.3 లీటర్లు పెండిమిథాలిన్ పిచికారీ చేయాలి. సోయా చిక్కుడులో విత్తిన 20 రోజుల సమయంలో 250 మిలీలీటర్ల ఇమజితాపిర్ మందు కూడా పిచికారీ చేయవచ్చు.

**వేరుశనగ:** విత్తిన వెంటనే లేదా 1 లేక 2 రోజుల్లో ఎకరాకు 1, -1.6 లీటర్ల పెండిమిథాలిన్ లేదా 1.5-2 లీటర్ల బుటాక్లోర్ 50 శాతాన్ని విత్తిన 20 లేక 25 రోజుల సమయంలో గడ్డి జాతి కలుపు నిర్మూలనకు ఎకరాకు పైనక్సాప్రాప్ ఇథైల్ పిచికారీ చేయాలి.

## మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్న వ్యక్తులపై కేసు

**గద్వాల క్రైం:** రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ నెల 17న గద్వాల జిల్లాలోని గట్టు, ధరూర్ ప్రాజెక్టుల పర్యటనలో భాగంగా గద్వాల మీదుగా వెళ్తున్న క్రమంలో.. ఓ పార్టీకి చెందిన వ్యక్తులు, కార్యకర్తలు కాన్వాయ్‌ను అడ్డగించి, రాళ్లతో దాడి, నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ కార్యక్రమాల పరిశీలనలో భాగంగా తన విధులకు అడ్డు తగిలి, ఆటంకం కలిగించినట్లు ప్రభుత్వ అధికారులు గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 18న ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంత్రి కాన్వాయ్‌కు అడ్డు తగిలి, నిరసన, రాళ్లతో దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదైనట్లు తెలిసింది.

### నలుగురు నిందితుల రిమాండ్

**శాంతినగర్:** వడ్డేపల్లి, అయిజ మండలాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు శాంతినగర్ ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. ఆరు రోజుల కిందట శాంతినగర్, జూలెకల్ స్టేజీ, అయిజ శివారులో చోరీ చేసిన నలుగురు నిందితులను, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

క్లుప్తంగా...

## ముందు బొట్టు పెట్టాలి కదా!



కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు రాఖీ కడుతున్న ఏపీఎం తదితరులు

తిరుమలాయపాలెం: ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సోమవారం తిరుమలాయపాలెం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రీవెన్స్‌ను పరిశీలించి దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారంపై ఉద్యోగులకు సూచనలు చేశారు. రాఖీ పండుగ కావడంతో అక్కడి ఐకేపీ ఏపీఎం అలివేలు మంగ కలెక్టర్‌కు రాఖీ కట్టి హారతి ఇచ్చారు. జిల్లా ఉన్నతాధికారి కావడంతో.. తనలాంటి ఉద్యోగి రాఖీ కట్టడాన్ని ఎలా భావిస్తారోనన్న సంశయంతోనే ఆమె రాఖీ కట్టారు. అయితే, బొట్టు పెట్టకుండా రాఖీ కట్టడాన్ని గమనించిన ఆయన 'ముందు బొట్టు పెట్టాలి కదా..'అంటూ ఆమెకు సంప్రదాయాన్ని గుర్తు చేశారు.

## విద్యుత్ సిబ్బంది సాహసం

- వరదలో ఈదుకుంటూ వెళ్లి మరమ్మతులు



వరదలో ఈదుకుంటూ వెళ్తున్న సిబ్బంది

కౌటాల(సిర్పూర్): విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం ఆ శాఖ సిబ్బంది సాహసం చేశారు. వరదలో ఈదుకుంటూ వెళ్లి మరమ్మతులు చేపట్టి శభాష్ అనిపించుకున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం టోంకిని, పారిగాం మధ్య 33 కేవీ విద్యుత్ లైన్‌పై సోమవారం పిడుగుపడటంతో ఇన్సులేటర్ కాలిపోయింది. సిర్పూర్(టి), కౌటాల మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇన్సులేటర్ దెబ్బతిన్న ప్రాంతాన్ని సిర్పూర్(టి) విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బంది గుర్తించారు. ఇన్సులేటర్ దెబ్బతిన్న స్తంభం చుట్టూ పెద్దవాగు బ్యాక్‌వాటర్ భారీగా చేరింది. సబ్‌స్టేషన్ ఉద్యోగులు ఇద్దరూ బెదరకుండా వరదనీటిలో ఈదుకుంటూ వెళ్లి నూతన ఇన్సులేటర్ అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

# కుండపోత.. ఉక్కపోత!



సోమవారం హైదరాబాద్ టోలిచౌకిలో ముంచెత్తిన వరద

▶ మొదటి పేజీ తరువాయి
వాతావరణ మార్పులే ఇందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు. వాతావరణ మార్పులతోనే ఒక్కసారిగా అతివృష్టి, లేకుంటే తీవ్ర అనావృష్టి పరిస్థితులు నెలకొంటున్నా యని పేర్కొంటున్నారు. ప్రణాళికలు లేని పట్టణీకరణ, పరిమితులు లేని వనరుల విని యోగం, సహజ వనరుల విధ్వంసం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతోందని, జీవన ప్రమాణాలు మరింత దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఎక్స్‌ట్రీమ్ వెదర్ ఈవెంట్స్

ప్రపంచంలోని పర్యావరణ నిపుణులు గొంతెత్తి చెబుతున్న ఒకేఒక్క మాట 'ఎక్స్‌ట్రీమ్ వెదర్ ఈవెంట్స్'. సీజన్‌కు అనుగుణంగా ఉష్ణోగ్రతలు, వర్షాలు నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పుడు పర్యావరణంలో నెలకొన్న భారీ మార్పులతో ఎండ, వానలు గతి తప్పాయి. రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా ఈ పరిస్థితి నెలకొంది. సీజన్‌లో నమోదు కావాల్సిన సాధారణ ఉష్ణోగ్రత, సాధారణ వర్షపాతం గణాంకాల్లో భారీ వ్యత్యాసం నమోదవుతూ వస్తోంది. ఉదాహరణకు అదిలాబాద్‌లో ప్రస్తుత సీజన్‌లో సాధారణ గరిష్ట ఉష్ణోగ్రత 30.6 డిగ్రీ సెల్సీయస్ నమోదు కావాల్సి ఉండగా.. సోమవారం ఏకంగా 34.3 డిగ్రీ సెల్సీయస్‌గా నమోదైంది. అదేవిధంగా ఖమ్మంలో ఈ సీజన్ సాధారణ గరిష్ట ఉష్ణోగ్రత 31.5 డిగ్రీ సెల్సీయస్ కాగా..సోమవారం 34.6 డిగ్రీ సెల్సీయస్‌గా నమోదైంది. రామగుండంలో 31.1 డిగ్రీ సెల్సీయస్ సాధారణ గరిష్ట ఉష్ణోగ్రతకు గాను 34.2 డిగ్రీ సెల్సీయస్ నమోదైంది. ఈ మూడు ప్రాంతాల్లోనూ సోమవారం నాడు సాధారణ గరిష్ట ఉష్ణోగ్రత కంటే 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రత నమోదైంది. ఆగస్టు నెలలో సాధారణ ఉష్ణోగ్రతలు కాస్త తక్కువగా నమోదు కావాల్సి ఉండగా, ఈసారి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ వాటికి తీవ్ర ఉక్కపోత తోడవడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రంలో 49.62 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. సోమవారం నాటికి 56.07 సెంటీమీటర్ల వర్షం కురిసింది. రాష్ట్ర సగటును పరిశీలిస్తే సాధారణం కంటే 13 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు కనిపిస్తున్నప్పటికీ.. చాలా జిల్లాల్లో లోటు వర్షపాతమే ఉంది. అంటే కొన్ని జిల్లాల్లో కురిసిన అతి భారీ వర్షాలే గణాంకాలను గణనీయంగా పెంచేశాయన్న మాట. ఉమ్మడి మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లో ఈ అతిభారీ వర్షాలు నమోదయ్యాయి. అంటే కొన్నిచోట్ల అతి తక్కువ వర్షాలు లేదా అసలు వర్షమే లేకపోగా కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు నమోదయ్యాయన్న మాట. వాతావరణంలోనూ ఇదే తరహా భిన్నమైన పరిస్థితులు నెలకొంటుండటం గమనార్హం.

### పట్టణీకరణ పేరిట వనరుల విధ్వంసం

పట్టణీకరణ పేరిట ఇప్పుడు వనరుల విధ్వంసం విపరీతంగా పెరుగుతోంది. పట్టణీకరణ వల్ల నీటివనరులు పెద్దయెత్తున ఆక్రమణలకు గురవుతుండగా.. చెట్లు, పుట్టలను ఇష్టారాజ్యంగా తెగనరికేస్తున్నారు. మొదట్లో మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్‌గా ప్రారంభమై ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా రూపాంతరం చెంది అంతకంతకకూ విస్తరిస్తున్నా.. నగరీకరణపై సరైన వ్యూహాత్మక ప్రణాళిక లేకపోవడంతో నష్టం వాటిల్లుతోందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు వందలాది చెరువులతో కళకళలాడిన హైదరాబాద్, ఇప్పుడు నీటి సమస్యతో సతమతమవుతోందని, చెరువులు కబ్జాల పాలుకావడమే ఇందుకు ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నీటి వనరులు కబ్జాలపాలు కావడంతో నీటి ప్రవాహం దెబ్బతిని వరదలు పెరుగుతున్నాయని, చివరకు నిల్వ చేయాల్సిన నీరు సముద్రం పాలుకావడంతో నీటి సమతుల్యత దెబ్బతింటోందని వివరిస్తున్నారు. అదేవిధంగా ఓపెన్ స్పేస్ నిబంధనలు గాలికొదిలి అనేక అంతస్తులతో భారీ నిర్మాణాలు చేపట్టడం, విచ్చలవిడి లేఅవుట్‌లతో పచ్చదనం పూర్తిగా తగ్గిపోతోందని అంటున్నారు. దేశంలో అత్యంత తక్కువ ఓపెన్ స్పేస్ ఏరియా ఉన్న నగరంగా హైదరాబాద్ రికార్డుల్లోకి ఎక్కడాన్ని గుర్తు చేస్తున్నారు.

### పెరగని సాగు విస్తీర్ణం

సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగడం, ఉక్కపోతతో కూడిన విభిన్న వాతావరణం నెలకొనడం పంటల సాగుపైనా ప్రభావం చూపించింది. వానాకాలం సీజన్ చివరి దశకు చేరుకున్నా రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరగలేదు. ఈ సీజన్‌లో పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1.29 కోట్ల ఎకరాలు కాగా.. ఈ నెల 14వ తేదీ వరకు 1.03 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో పంటలు వేయాల్సి ఉంది. కానీ 94 లక్షల ఎకరాల మేర మాత్రమే పంటలు సాగవడం గమనార్హం.

### నీటి వనరుల విషయంలో కఠినంగా వ్యవహరించాలి

హైదరాబాద్ లాంటి నగరానికి అతి త్వరలో తీవ్ర నీటి సమస్య ఎదురు కానుంది. ఒకప్పుడు వేలల్లో ఉన్న చెరువులు ఇప్పుడు వందల్లోకి పడిపోయాయి. నీటి నిల్వలకు కేంద్రంగా ఉండే చెరువుల సంఖ్య తగ్గిపోతుండగా కాలువలన్నీ కబ్జాలపాలవుతున్నాయి. ఉదాహరణకు ఫిరంగి రనాలా అనే కాలువతో శివారు ప్రాంతాల్లోని 22 చెరువులు నీటితో నిండేవి. కానీ ఈ నాలా కబ్జాకు గురైంది. దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయి. కానీ ఫలితం లేదు. ఆ నాలాను పునరుద్ధరిస్తే దాని కింద ఉన్న గొలుసుకట్టు చెరువులు నీటితో కళకళలాడుతాయి. అదేవిధంగా నగరంలో ఉన్న చెరువులు, ప్రధాన కాలువలను పునరుద్ధరించి పరిరక్షిస్తే నీటి సమస్యకు కొంతైనా పరిష్కారం లభిస్తుంది.

– ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్త

### సమగ్ర ప్రణాళికతోనే సాధ్యం...

నగరీకరణలో అత్యంత కీలకం సమగ్ర ప్రణాళిక. కానీ ఇప్పుడు కేవలం కట్టడాలతోనే అభివృద్ధి జరుగుతుందనే ఆలోచన ఉంది. అడ్డగోలు కట్టడాలతో కాంక్రీట్ జంగిల్‌గా మారడం తప్ప మెరుగైన జీవావరణం ఏవిధంగా సాధ్యమవుతుంది. అందుకే పక్కా ప్రణాళికను రూపొందించి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇప్పుడు హైదనాబాద్‌లో అక్రమ నిర్మాణాల తొలగింపు ప్రక్రియ గత కొన్ని రోజులుగా కనిపిస్తోంది. ప్రభుత్వం ఇదే చిత్తశుద్ధితో పూర్తిస్థాయిలో కట్టడాల తొలగింపుతో పాటు ప్రణాళికబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలను వ్యూహాత్మకంగా అమలు చేయాలి.

– సుబ్బారావు, పర్యావరణ నిపుణులు

2023, 2024ల్లో ఆగస్టు 12 నుంచి 17 వరకు నమోదైన విద్యుత్ వినియోగం వివరాలు..

| 2024 | మి.యూనిట్లు | 2023 | మి.యూనిట్లు |
|---|---|---|---|
| ఆగస్టు 17న | 270.808 | ఆగస్టు 17న | 268.638 |
| ఆగస్టు 16న | 288.52 | ఆగస్టు 16న | 265.179 |
| ఆగస్టు 15న | 287.486 | ఆగస్టు 15న | 255.56 |
| ఆగస్టు 14న | 294.414 | ఆగస్టు 14న | 271.844 |
| ఆగస్టు 13న | 290.542 | ఆగస్టు 13న | 274.411 |
| ఆగస్టు 12న | 281.217 | ఆగస్టు 12న | 267.151 |

## బస్సులో ఒకరు.. ఆటోలో మరొకరు ప్రసవం

వనపర్తి, భద్రాచలంలో ఘటనలు.. తల్లీబిడ్డలు క్షేమం



పాపను చూపిస్తున్న కండక్టర్ భారతి, చిత్రంలో తల్లి సంధ్య



మనవడిని లాలిస్తున్న అమ్మమ్మ

వనపర్తి / భద్రాచలంఅర్బన్ : బస్సులో ప్రయాణం చేస్తుండగా ఓ గర్భిణికి, ప్రసవానికి ఆస్పత్రికి తీసుకొస్తుండగా మరొకరికి పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో బస్సు, ఆటోలోనే ఇద్దరికీ ప్రసవం చేశారు. బస్సులో స్టాఫ్‌నర్సు, ఆటోలో డాక్టర్లు పురుడు పోసి మానవత్వం చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సోదరులకు రాఖీ కట్టేందుకు జోగుళాంబ గద్వాల జిల్లా కొండుపల్లి గ్రామానికి చెందిన గర్భిణి సంధ్య భర్త రామంజితో కలిసి ఆర్టీసీ బస్సు ఎక్కింది. బస్సు వనపర్తి మండలం నాచహళ్లి గ్రామ శివారులోకి రాగానే, సంధ్య పురిటి నొప్పులు తట్టుకోలేనంటూ కండక్టర్ భారతికి చెప్పింది. దీంతో 108కు సమాచారం అందించి.. వెంటనే బస్సులోని ప్రయాణికులను కిందకు దింపారు. అదే బస్సులో ప్రయాణిస్తున్న స్టాఫ్‌నర్సు అలివేలు సాయంతో సాధారణ ప్రసవం చేయగా, ఆడశిశువు జన్మించింది. అనంతరం తల్లీబిడ్డను 108లో వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సులో పురుడు పోసుకున్న మహిళ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న ఆ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. సమయస్ఫూర్తి, మానవత్వం చాటిన మహిళా కండక్టర్ భారతిని ప్రశంసించారు. కండక్టర్, స్టాఫ్‌నర్సును మంగళవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీభవన్‌కు రావాలని సూచించారు.ఈ ఘటనపై కండక్టర్ భారతి మాట్లాడుతూ జీవితంలో ఈ ఘటన గుర్తుండిపోతుందని చెప్పారు. స్టాఫ్‌నర్సు అలివేలు మాట్లాడుతూ సంధ్యది మాది ఒకే ఊరు అని, కాన్పు చేసేందుకు గ్లౌసులు లేకపోయినా వెనుకాడలేదన్నారు. పాప తల, మెడకు పేగు చుట్టుకొని ఉంది. దాన్ని జాగ్రత్తగా తీసి సుఖ ప్రసవం చేశామని చెప్పారు.

భద్రాచలంలో....
భద్రాచలం పట్టణంలోని రాజుపేటకు చెందిన సాయినిఖితకు సోమవారం వేకువజామున పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు రాజుపేట నుంచి ఆటోలో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా, ఆస్పత్రి ప్రాంగణంలోనికి రాగానే నొప్పులు ఎక్కువ కావడంతో భర్త హరీశ్ మాతాశిశు విభాగం సిబ్బందికి చెప్పాడు. వెంటనే నర్సులు కృష్ణవేణి, నాగలక్ష్మి వచ్చి పరీక్షించగా, అప్పటికే శిశువు గర్భం నుంచి కిందకు జారి పేగులు మెడలో వేసుకొని బయటకు రావడాన్ని గమనించారు. వెంటనే ప్రసవం చేయగా, సాయినిఖిత మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను చికిత్స నిమిత్తం ప్రసవ వార్డుకు తరలించారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించిన న్యాయమూర్తి



బిడ్డతో జూనియర్ సివిల్ జడ్జి స్వప్న

సింగరేణి (కొత్తగూడెం): నల్లగొండ జిల్లా మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి టి.స్వప్న ఆదివారం రాత్రి కొత్తగూడెం ప్రభ ుత్వ ఆస్పత్రిలో ప్రసవించారు. కొత్తగూడెంలోని బూడిదగడ్డ బస్తీకి చెందిన న్యాయవాది శాంత కుమార్తె అయిన స్వప్నకు మిర్యాలగూడ మండలం నిడమనూరుకు చెందిన దాసరి కార్తీక్‌తో వివాహం జరిగింది. ప్రస్తుతం నల్లగొండ జిల్లా మున్సిఫ్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న స్వప్న.. ప్రసవం కోసం కొత్తగూడెంలోని పుట్టింటికి వచ్చారు. ఉన్నత విద్యనభ్యసించి, న్యాయమూర్తిగా కొనసాగుతున్న ఆమె.. కార్పొరేట్ స్థాయి వైద్యం చేయించుకునే స్థోమత ఉన్నా సామాన్య ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో కొత్తగూడెంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో చేరగా ఆదివారం రాత్రి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సేవలు ఉపయోగించుకోవాలని, పూర్తి నమ్మకంతో వైద్యం పొందాలని సూచించారు. తనకు వైద్యసేవలందించిన డాక్టర్ సాగరిక, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## రాఖీ బంధం

ప్రేమానురాగాలను చాటే రాఖీ పండగను సోమవారం ఉమ్మడి జిల్లాలో ఉత్సాహంగా జరుపుకొన్నారు. ఈ క్రమంలో పలువురు ప్రముఖులు సైతం తమ సోదరీమణులతో రాఖీలు కట్టించుకొని ఆత్మీయతను చాటిచెప్పారు.

– సాక్షి నెట్‌వర్క్



సోదరుడికి రాఖీ కడుతున్న పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి రాఖీ కడుతున్న సోదరి



దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి



మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్‌కు రాఖీ కడుతున్న మహిళా సిబ్బంది

## చెర్రీ కోసం.. అత్తారింటి నుంచి పుట్టింటికి

- పెంపుడు శునకానికి రాఖీ కట్టిన మహిళ



పెంపుడు శునకానికి రాఖీ కడుతున్న సింధు

ఉప్పునుంతల: సాధారణంగా రాఖీ పండుగ రోజు ఆడపడచులు అన్నాతమ్ముళ్లకు రాఖీలు కట్టి అనుబంధాలను చాటిచెబుతారు. అయితే ఓ మహిళ ప్రేమగా పెంచుకుంటున్న పెంపుడు శునకానికి రాఖీ కట్టి మూగజీవాలపై వాత్సల్యం చాటింది. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని పెనిమిళ్లకు చెందిన ఆకుల రజిత, రాజయ్య దంపతులకు సింధు, స్వదేశ్ సంతానం. అయితే వీరు 14 ఏళ్ల క్రితం నెల వయస్సు ఉన్న కుక్కపిల్లను తెచ్చుకొని చెర్రీ అని పేరు పెట్టి ప్రేమగా చూసుకుంటున్నారు. కుక్కపిల్లను సైతం తమ తోబుట్టువుగానే భావిస్తూ సోదరునితోపాటు చెర్రీకి సైతం క్రమం తప్పకుండా రాఖీ కట్టేది. రెండేళ్ల క్రితం సింధుకు హైదరాబాద్‌లోని హస్తినాపూర్‌కు వ్యక్తితో వివాహమైంది. కాగా సింధు గతేడాది అత్తారింటి నుంచి వచ్చి సోదరుడు స్వదేశ్, కుక్కపిల్లకు రాఖీ కట్టింది. అయితే ఈసారి స్వదేశ్ అమెరికాలో ఉన్నప్పటికీ సింధు పెనిమిళ్లకు వచ్చి చెర్రీకి రాఖీ కట్టడం గమనార్హం.

## ఆర్టీసీ బస్టాండ్‌లో వేడుకలు



మహబూబ్‌నగర్ డిపోలో డ్రైవర్‌కు రాఖీ కడుతున్న కండక్టర్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రాఖీ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. మహిళా కండక్టర్లు డ్రైవర్లు, కండక్టర్లరు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి మాట్లాడుతూ రాఖీ పండుగను రీజియన్‌లోని అన్ని డిపోల్లో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. పండుగ వాతావరణంలో రాఖీ వేడుకలు నిర్వహించినట్లు చెప్పారు. అంతకు ముందు ఉదయం డిపోలో కూడా రాఖీ పండుగ జరుపుకొన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుజాత, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో



సుంకేసుల జలాశయంలో నీటి నిల్వ

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 54,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, సోమవారం సాయంత్రానికి 48,500 క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గడంతో తెరిచిన 5 గేట్లను మూసివేసినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు వరద, రిజర్వాయర్ నీటిమట్టం పెరిగినా గేట్లను తెరిచే అవకాశం ఉన్నట్లు అధికారులు చెప్పారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 40,020, ఆవిరిరూపంలో 94, నెట్టెంపాడుకు 750, కుడి కాల్వ ద్వారా 735, ఎడమ కాల్వకు 920, కోయిల్‌సాగర్‌కు 315, సమాంతర కాల్వకు 500, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 43,334 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.132 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు వద్ద 2 గేట్లను తెరిచి 14,120 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 33.313 టీఎంసీల పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉంది.

**138.239 మిలియన్‌యూనిట్ల విద్యుదుత్పత్తి**
ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో సోమవారం 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు ఉత్పత్తి చేపడుతున్నారు. ఇప్పటివరకు 138.239 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

**రామన్‌పాడులో 1,021 అడుగుల నీటిమట్టం**
మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయానికి జూరాల ఎడమ కాల్వ ద్వారా 920, సమాంతర కాల్వ ద్వారా 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. సోమవారం 1,021 అడుగుల నీటిమట్టం చేరింది. దీంతో ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,150 క్యూసెక్కులు, వివిధ లిఫ్టుల ద్వారా 858, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు.

**శ్రీశైలంలో 881.4 అడుగుల నీటిమట్టం**
దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం 881.4 అడుగుల నీటిమట్టం, 195.6 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 17,648, జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 39,907 మొత్తం 57,555 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,540 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 29,666, రేగుమాన్ గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.706 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 11.163 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. స్థానికంగా 7.80 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**సుంకేసులకు భారీగా తగ్గిన ఇన్‌ఫ్లో**
రాజోళి: సుంకేసుల డ్యాంకు పది రోజుల వరకు లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరగా, సోమవారం భారీగా తగ్గింది. ఎగువ నుంచి 20,100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 4 గేట్లను తెరిచి 17,648 క్యూసెక్కులు నీరు దిగువకు వదిలారు. కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



ఆత్మకూర్ బస్టాండ్‌లో ఇలా..

## కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాఖీ పండుగతో సోమవారం ఆర్టీసీ బస్టాండ్లు సందడిగా మారి కిటకిటలాడాయి. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ కనిపించింది. రాఖీ పండుగ దృష్ట్యా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రీజియన్ వ్యాప్తంగా 100 అదనపు సర్వీసులు నడిపారు. ముఖ్యంగా హైదరాబాద్ రూట్లో అధికంగా బస్సు లు నడిపారు. ఈ రూట్లోని బస్సులు ప్రయాణికులతో రద్దీగా వెళ్లాయి. సాయంత్రం వేళ మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో ఎక్కడా చూసినా ప్రయాణికులే కనిపించారు. మంగళవారం కూడా పండుగ తిరుగు ప్రయాణంలో రద్దీ ఉండే అవకాశం ఉంది.